ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రిక




## హైదరాబాద్ మోష్ పబ్ కేసులో
# 8 మంది అరెస్ట్
### కొత్త తరహా మోసం

హైదరాబాద్, జూన్ 12 (ప్రభాత ఉదయం): హైదరాబాద్ మహానగరంలో కొత్త తరహా మోసం వెలుగులోకి వచ్చింది. ఈ మధ్యకాలంలో చాలా మంది అబ్బాయిలు అమ్మాయిల వలలో పడి తమ మొబైల్ లలో డేటింగ్ యాప్ లను ఇన్ స్టాల్ చేసుకుంటున్నారు. దీనిని ఆసరాగా చేసుకుని కొందరు పబ్ యజమానులు అమ్మాయిలతో కొత్త తరహా మోసానికి పాల్పడుతున్నారు. వీటి బారిన పడి కొంత మంది భారీగా డబ్బులు పోగొట్టుకుంటున్నారు. కస్టమర్లను మోసం చేస్తున్న పబ్ లపై పోలీసులు దృష్టి సారించారు. ఇటీవల వెలుగులోకి వచ్చిన మోష్ పబ్ కేసును వారు సీరియస్ గా తీసుకున్నారు. ఢిల్లీ నుంచి అమ్మాయిలను తీసుకుని వచ్చి ..మిగతా 2లో

సంపుటి: 2 | సంచిక: 63 | పేజీలు: 4 | వెల: రూ.3/- | గురువారం 13 జూన్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్


# ఏపీ ముఖ్యమంత్రిగా చంద్రబాబు
# ప్రమాణ స్వీకారం
### తరలివచ్చిన ప్రధాని, రాజకీయ, సినీ ప్రముఖులు

- కొలువుదీరిన కొత్త ప్రభుత్వం
- పవన్ కళ్యాణ్, లోకేశ్ తదితరుల ప్రమాణం
- ప్రమాణం చేయించిన గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్
- హాజరైన ప్రధాని మోడీ, అమిత్ షా, గడ్కరీ తదితరులు
- కార్యక్రమంలో మార్మోగిన చంద్రబాబు, టిడిపి నినాదాలు





విజయవాడ, జూన్ 12 (ప్రభాత ఉదయం): ఆంధ్రప్రదేశ్‌లో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. గత ఎన్నికల్లో అతిపెద్ద విజయం సాధించిన కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. నూతన ముఖ్యమంత్రిగా తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం చేశారు. కృష్ణా జిల్లా కేసరపల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ చంద్రబాబుతో ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం ఇది నాలుగోసారి. అనంతరం మంత్రులతో గవర్నర్ ప్రమాణ స్వీకారం చేయించారు. చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేస్తున్న సమయంలో సభా ప్రాంగణం జై చంద్రన్న నినాదాలతో మార్మోగిపోయింది. తెదేపా నేతలు, కార్యకర్తలు తమ స్థానాల్లోనే నిలుచుని చప్పట్లతో అభినందనలు పలికారు. ప్రమాణ స్వీకారం అనంతరం ప్రధాని మోదీతో పాటు వేదికపై ఉన్న పలువురు అతిథులు చంద్రబాబుకు శుభాకాంక్షలు చెప్పారు. ఈ కార్యక్రమానికి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, కేంద్ర మంత్రులు అమిత్‌షా, జేపీ నడ్డా, నితిన్ గడ్కరీ, రామ్మోహన్‌నాయుడు, చిరాగ్ పాసవాన్‌తో పురంధేశ్వరి, మహారాష్ట్ర సిఎం ఏక్‌నాథ్ షిండే, మాజీ గవర్నర్ తమిళసై, మాజీ సిఎం పన్నీరు సెల్వం తదితరులు కూడా హాజరయ్యారు. పాటు వివిధ పార్టీలకు చెందిన పలువురు జాతీయ నాయకులు హాజరయ్యారు. సినీ ప్రముఖులు చిరంజీవి, రజనీకాంత్ దంపతులు, రామ్‌చరణ్ తదితరులు వచ్చారు. చంద్రబాబు నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో పాటు జనసేన అధినేత పవన్ కల్యాణ్, తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మంత్రులుగా ప్రమాణం చేశారు. చంద్రబాబుతో పాటు మరో 24 మంది చేత గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ప్రమాణం చేయించారు. మంత్రివర్గ ..మిగతా 2లో



# కువైట్‌లో ఘోర అగ్నిప్రమాదం
### 40 మంది భారతీయులు దుర్మరణం

కువైట్, జూన్ 12 (ప్రభాత ఉదయం): అరబ్ దేశం కువైట్‌లో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఓ భవనంలో మంటలు చెలరేగి 41 మంది మృతిచెందారు. వీరిలో 40 మంది భారతీయులే కావడం మరింత విషాదకరం. జీవనోపాధి కోసం సొంతవాళ్లకు దూరంగా వచ్చి ఓ కంపెనీలో పనిచేస్తున్న వీరంతా ఇలా దురదృష్టవశాత్తూ ప్రాణాలు కోల్పోయారు. దక్షిణ మంగాఫ్ నగరంలోని ఓ ఆరు అంతస్తుల భవనంలో బుధవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. ప్రమాద సమయంలో భవనంలో 160 మంది ఉన్నారు. వీరంతా ఒకే కంపెనీలో పనిచేస్తున్నట్లు తెలిపింది. తొలుత కిచన్‌లో ప్రారంభమైన మంటలు క్షణాల్లోనే భవనమంతా వ్యాపించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఘటనలో 35 మంది మంటల్లో కాలి సజీవదహనమవ్వగా.. మరో ఆరుగురు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో 40 మంది భారతీయులేనని జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ ప్రమాదంలో మరో 50 మందికి పైగా గాయపడ్డారు. వీరిలో 30 మంది భారతీయులే. ఘటన జరిగిన భవనం కువైట్‌లోని అతిపెద్ద నిర్మాణ సంస్థకు చెందినదిగా తెలిసింది. ప్రమాదం జరిగిన సమయంలో భవనంలోని చాలా మంది నిద్రలో ఉన్నారు. దీంతో ప్రాణనష్టం ..మిగతా 2లో

# తెలంగాణ టెట్ ఫలితాలు వెల్లడి
### విడుదల చేసిన సిఎం రేవంత్ రెడ్డి




హైదరాబాద్, జూన్ 12 (ప్రభాత ఉదయం): తెలంగాణ టెట్ ఫలితాలు వెల్లడయ్యాయి. బుధవారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి టెట్ ఫలితాలను విడుదల చేశారు. టీజీ టెట్ 2024 ఫలితాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విడుదల చేశారు. టీజీ టెట్-2024 పేపర్-1కు 57,725 మంది అర్హత సాధించగా, పేపర్-2కు 51,443 మంది అర్హత సాధించారు. పేపర్-1లో 67.13శాతం.. పేపర్-2లో 34.18శాతం అర్హత సాధించారు. టెట్-2024లో అర్హత సాధించని దరఖాస్తుదారులకు వచ్చే టెట్ కు ఉచితంగా దరఖాస్తు చేసుకునే వెలుసుబాటు ప్రభుత్వం కల్పించింది. ఇక, టెట్-2024లో అర్హత సాధించిన వారికి ఒకసారి ఉచితంగా డిఎస్సికి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. కాగా, గత మార్చి 15వ తేదీన టిజిటెట్ 2024 నోటిఫికేషన్ వెలువడగా.. పేపర్-1కు 99,958 మంది, పేపర్-2కు 1,86,423 మంది దరఖాస్తు చేసుకున్నారు. మే 20వ తేదీన ప్రారంభమైన టెట్ పరీక్షలు జూన్ 2వ తేదీతో ముగిశాయి. పేపర్-1కి 86.03 శాతం మంది, పేపర్-2కి 82.58 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. పేపర్-1లో 67.13 శాతం మంది, పేపర్-2 లో 34.18 శాతం మంది అర్హత సాధించారు. పేపర్-1లో మొత్తం 85,996 మంది పరీక్ష రాయగా ..మిగతా 2లో

# రాష్ట్రవ్యాప్తంగా విస్తరించిన నైరుతి
### మరో మూడు రోజులు వర్షాలు



హైదరాబాద్, జూన్ 12 (ప్రభాత ఉదయం): నైరుతి రుతుపవనాలు రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాయి. వీటి ప్రభావంతో రాష్ట్రంలో వచ్చే మరో మూడురోజులపాటు మోస్తరు నంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. బుధ, గురు, శుక్రవారాల్లో వివిధ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఆయా రోజుల్లో ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఈదురు గాలులతోపాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుందని ..మిగతా 2లో



# గ్రూప్ -1 మెయిన్స్ పరీక్షల షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, జూన్ 12 (ప్రభాత ఉదయం): గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష లకు సంబంధించిన షెడ్యూల్‌ను టీఎస్‌పీఎస్సీ విడుదల చేసింది. అక్టోబర్ 21వ తేదీ నుంచి 27 వరకు మెయిన్స్ పరీక్షలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్ ..మిగతా 2లో

# ఆర్టీసీ బస్సు ఛార్జీల పెంపుపై టీజీఎస్‌ఆర్టీసీ క్లారిటీ
### సోషల్ మీడియాలో ప్రచారం చేస్తే కేసులు




హైదరాబాద్, జూన్ 12 (ప్రభాత ఉదయం): తెలంగాణలో ఆర్టీసీ బస్సు ఛార్జీలు పెంచుతున్నారన్న వార్తలపై తెలంగాణ ఆర్టీసీ క్లారిటీ ఇచ్చింది. టోల్ ప్లాజాల వద్ద రేట్లు పెంచిన నేపథ్యంలో తెలంగాణలో టోల్ ప్లాజాలున్న మార్గాల్లో నడిచే బస్సుల్లో టికెట్ ఛార్జీలోని టోల్ రుసుమును మూడు రూపాయల చొప్పున పెంచారంటూ వార్తలు వచ్చాయి. కేంద్రం టోల్ ఛార్జీలు పెంచిన నేపథ్యంలో తెలంగాణలోని ఎక్స్‌ప్రెస్ బస్సులో టోల్ రుసుమును ..మిగతా 2లో

ప్రభాత ఉదయం


# ఏపీ ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం





**మొదటి పేజీ తరువాయి...**

కూర్పులో భాగంగా జనసేన నుంచి ముగ్గురు, భాజపా నుంచి ఒకరిని మంత్రివర్గంలోకి తీసుకున్నారు. సీనియర్లకు, యువతకు మధ్య సమతూకం పాటిస్తూ మంత్రివర్గాన్ని రూపొందించారు. ఇందులో 17 మంది కొత్తవారే కావడం గమనార్హం. ముగ్గురు మహిళలకు చోటు లభించింది. బీసీలు ఎనిమిది మంది, ఎస్సీలు ఇద్దరు, ఎస్టీ ఒకరు, ముస్లిం మైనారిటీల నుంచి ఒకరికి, వైశ్యుల నుంచి ఒకరికి అవకాశం దక్కింది. నలుగురు కాపులు, నలుగురు కమ్మ, ముగ్గురు రెడ్లకు అవకాశమిచ్చారు. తెదేపా నుంచి పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మంత్రివర్గంలో చేరారు. జనసేన నుంచి పవన్ కల్యాణ్, నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ మంత్రివర్గంలో చోటు దక్కించు కున్నారు. భాజపా నుంచి సత్యకుమార్ యాదవ్‌కు అవకాశం దక్కింది. ప్రమాణ స్వీకారం చేసిన వారిలో... పవన్ కల్యాణ్ (జనసేన), నారా లోకేశ్ (తెదేపా), అచ్చెన్నాయుడు (తెదేపా),కొల్లు రవీంద్ర (తెదేపా), . నాదెండ్ల మనోహర్ (జనసేన),పి. నారాయణ (తెదేపా), వంగలపూడి అనిత (తెదేపా), సత్యకుమార్ యాదవ్ (భాజపా),నిమ్మల రామానాయుడు (తెదేపా), ఎన్.ఎమ్.డి ఫరూక్ (తెదేపా), ఆనం రామనారాయణరెడ్డి (తెదేపా), పయ్యావుల కేశవ్ (తెదేపా), అనగాని సత్యప్రసాద్ (తెదేపా),కొలుసు పార్థసారథి (తెదేపా), డోలా బాలవీరాంజనేయస్వామి (తెదేపా),గొట్టిపాటి రవి (తెదేపా), కందుల దుర్గేశ్ (జనసేన), గుమ్మిడి సంధ్యారాణి (తెదేపా), బీసీ జనార్ధన్‌రెడ్డి (తెదేపా), టీజీ భరత్ (తెదేపా),ఎస్.సవిత (తెదేపా), వాసంశెట్టి సుభాష్ (తెదేపా), కొండపల్లి శ్రీనివాస్ (తెదేపా), మందిపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డి (తెదేపా) ఉన్నారు. ప్రమాణం చేసిన వారంతా తెలుగులోనే దైవసాక్షిగా ప్రమాణాం చేశారు. ఎన్ఎండి ఫరూక్ తెలుగులోనే అల్లా సాక్షిగా ప్రమాణం చేశారు. టిజి భరత్ ఇంగ్లీషులో ప్రమాణం చేశారు. ప్రమాణస్వీకారం అనంతరం ఒక్కొక్కరే ప్రధాని మోడీ, సిఎం చంద్రబాబు, ఇతర పెద్దలకు అభివాదం చేశారు. చంద్రబాబు పలువురిని మోడీకి పరిచయం చేశారు. పవన్ కళ్యాణ్ వేదికపై అందరికి అభివాదం చేసి, తన అన్న చిరంజీవికి మాత్రం పాదాభివందనం చేశారు.



# కువైట్‌లో ఘోర అగ్నిప్రమాదం

**మొదటి పేజీ తరువాయి...**

ఎక్కువగా ఉన్నట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. కువైట్ అగ్ని ప్రమాద ఘటనపై భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 40 మందికి పైగా మరణించారని, మరో 50 మందికి పైగా బాధితులు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చేరినట్లు తెలిసిందన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. విషయం తెలిసిన వెంటనే కువైట్‌లోని భారతీయ రాయబారి ఘటనా స్థలాన్ని సందర్శించారని.. బాధితులకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ప్రమాదంపై కువైట్ అధికారుల నుంచి మరింత సమాచారం కోసం ఎదురుచూస్తున్నట్లు వెల్లడించారు. ఈ ఘటనపై ప్రషధాని మోడీ ఆరా తీసారు. బాధితులకు సాయంపై అధికారులతో చర్చించారు. తెల్లవారుజామున కార్మికులు నివాసం ఉంటున్న భవనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగి పెద్ద ఎత్తున వ్యాపించాయి. భవనంలో మంటలు వేగంగా వ్యాపించడంతో చాలా మంది లోపల చిక్కుకున్నారు. ఈ ప్రమాదంలో ఐదుగురు కేరళీయులు మరణించినట్లు నివేదికలు వెల్లడించాయి. దట్టమైన పొగతో ఊపిరాడక చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 40మందికి పైగా సృహ తప్పి పడిపోయారు. అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటనాస్థలానికి చేరుకుని మంటలను అందుపు చేశారు. భవనంలో చిక్కుకున్న వారిని రక్షించి బయటకు తీసుకొచ్చారు. తీవ్రంగా గాయపడినవారిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు' అని సీనియర్ పోలీసు కమాండర్ తెలిపారు. అగ్నిప్రమాదం కారణంగా 43 మంది ఆసుపత్రి పాలయ్యారని, వారిలో నలుగురు మరణించారని కువైట్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. పోలీసులు చెప్పిన 35 మరణాలకు అదనంగా నలుగురి మరణాలు ఉన్నాయా? అనేది స్పష్టంగా తెలియలేదు. మంటలను అదుపు చేశామని, ప్రమాదానికి గల కారణాలను పరిశీలిస్తున్నామని అధికారులు తెలిపారు.




# గ్రూప్ -1 మెయిన్స్ పరీక్షల షెడ్యూల్ విడుదల

**మొదటి పేజీ తరువాయి...**

మీడియంలలో మెయిన్స్ పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రతి పేపర్ మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించనున్నారు. ఈ నెల 9వ తేదీన గ్రూప్ -1 ప్రిలిమ్స్ పరీక్షను నిర్వహించిన సంగతి తెలిసిందే. త్వరలోనే ఫలితాలను విడుదల చేయనున్నారు.

**మెయిన్స్ పరీక్షల షెడ్యూల్ ఇదే..**

అక్టోబర్ 21 %–% జనరల్ ఇంగ్లీష్(క్వాలిఫయింగ్ టెస్ట్)
అక్టోబర్ 22 %–% పేపర్ 1(జనరల్ ఎస్సే)
అక్టోబర్ 23 %–% పేపర్ 2(హిస్టరీ, కల్చర్ అండ్ జియోగ్రఫీ)
అక్టోబర్ 24 %–% పేపర్ 2 (ఇండియన్ సొసైటీ, రాజ్యాంగం అండ్ గవర్నెన్స్)
అక్టోబర్ 25 %–% పేపర్ 4(ఎకానమి అండ్ డెవలప్‌మెంట్)
అక్టోబర్ 26 %–% పేపర్ 5(సైన్స్ అండ్ టెక్నాలజీ అండ్ డాటా ఇంటర్‌ప్రిటేషన్)
అక్టోబర్ 27 %–% పేపర్ 6(తెలంగాణ మూవ్‌మెంట్ అండ్ స్టేట్ ఫార్మేషన్)

## ఆర్టీసీ బస్సు చార్జీల పెంపుపై
# టీజీఎస్‌ఆర్టీసీ క్లారిటీ

**మొదటి పేజీ తరువాయి...**

ఒక్కో కౌంటర్‌కు పది నుంచి 13కు, డీలక్స్, లగ్జరీ, రాజధాని, గరుడ, వజ్ర బస్సుల్లో 13 నుంచి 16 రూపాయలకు, గరుడ ప్లస్ బస్సుల్లో 14 నుంచి 17 రూపాయలకు, నాన్ ఏసీ స్లీపర్, హైబ్రిడ్ స్లీపర్లో రూ.15 నుంచి రూ.18కి, ఏసీ స్లీపర్ బస్సుల్లో రూ. 20 నుంచి రూ.23కు పెంచినట్లు వార్తలు వచ్చాయి. అయితే తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ దీనిపై క్లారిటీ ఇచ్చింది. ఆర్టీసీ బస్సుల్లో సాధారణ ఛార్జీలు పెరిగాయని జరుగుతున్న ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని ప్రకటన విడుదల చేసింది. సాధారణ చార్జీలు యథాతథంగానే ఉన్నాయని తెలిపింది. హైవేలపై టోల్ చార్జీలను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకుందన్న తెలంగాణ ఆర్టీసీ.. ఆ పెంచిన టోల్ చార్జీల మేరకు టికెట్ లోని టోల్ సెస్‌ను సవరించుకున్నట్లు తెలిపింది. ఈ సవరించిన టోల్ సెస్ జూన్ 3వ తేదీ నుంచే అమల్లోకి వచ్చిందని వివరణ ఇచ్చింది. టోల్ ప్లాజాలున్న రూట్లలోనే టోల్ సెస్‌ను సవరించినట్లు తెలిపింది. అలాగే సాధారణ రూట్లలో టికెట్ ఛార్జీల్లో ఎలాంటి మార్పుల్లేవని ప్రకటనలో పేర్కొంది. అయితే టీజీఎస్‌ఆర్టీసీ సాధారణ బస్ ఛార్జీలను పెంచిందని వాస్తవాలు తెలుసుకోకుండా ప్రచారం చేస్తున్నారని తెలంగాణ ఆర్టీసీ ప్రకటనలో తెలిపింది. ఉద్దేశ్యపూర్వకంగా సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేయడం మంచిది కాదని సూచించింది. ఆర్టీసీ సంస్థ ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా తప్పుడు ప్రచారం చేసే వారిపై పోలీస్ శాఖ సహకారంతో చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.



# ఆర్టీసీ బస్సులో భట్టి ప్రయాణం

## ప్రయాణికులతో సమస్యలపై చర్చ

ఖమ్మం, జూన్ 12 (ప్రభాత ఉదయం): ఖమ్మంలో పర్యటనలో భాగంగా డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క బుధవారం ఆర్టీసీ బస్సులో సాధారణ ప్రయాణికుడిలా ప్రయాణించారు. ఖమ్మం పాత బస్టాండ్ నుంచి బోనకల్ వరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణించారాయన. ఈ సందర్భంగా బస్సులో ప్రయాణికులతో ఆయన మమేకం అవుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత బస్సు రవాణా సౌకర్యం గురించి మహిళలతో నేరుగా మాట్లాడారు. బస్సులో జగన్నాథపురం గ్రామం వద్ద భట్టి విక్రమార్క దిగిపోయారు. గ్రామాలకు బస్సు రవాణా సౌకర్యం, మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు భట్టి ఈ క్షేత్రస్థాయి పర్యటన చేపట్టారు. భట్టి విక్రమార్కతో పాటుగా ఖమ్మం జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, పలువురు అధికారులు ప్రజాప్రతినిధులు ఉన్నారు.




# తెలంగాణ టెట్ ఫలితాలు వెల్లడి

**మొదటి పేజీ తరువాయి...**

57,725 మంది క్వాలి÷ అయ్యారు. పేపర్–2కు మొత్తం 1,50,491 మంది పరీక్ష రాయగా.. కేవలం 51,443 మంది మాత్రమే అర్హత సాధించారు. అభ్యర్థులు ఫలితాల కోసం వెబ్‌సైట్‌ను సందర్శించాలని అధికారులు సూచించారు. గత ఏడాది జరిగిన టెట్ పరీక్షలతో పోలిస్తే ఈ ఏడాది పేపర్–1లో ఉత్తీర్ణత శాతం 30.24 శాతం, పేపర్–2లో ఉత్తీర్ణత శాతం 18.88 శాతం పెరిగిందని వెల్లడించారు. అయితే టెట్ దరఖాస్తుదారులకు రాష్ట్ర ప్రభుత్వం ఉపశమనం కల్పించింది. సారి టెట్ అర్హత సాధించనివారు వచ్చే టెట్‌కు ఉచితంగా దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. అదేవిధంగా టెట్‌లో అర్హత సాధించిన వాళ్లు డీఎస్సీకి ఎలాంటి ఫీజులేకుండా ఉచితంగా దరఖాస్తు చేసుకునే అవకాశం ఇచ్చింది. ఎన్నికల కోడ్ కారణంగా టెట్–2024 ఫీజును తగ్గించలేకపోయామని ప్రభుత్వం తెలిపింది. అందుకే తదుపరి టెట్, డీఎస్సీ దరఖాస్తుదారులకు ఉపశమనం కల్పించాలని నిర్ణయించినట్లు వెల్లడించింది.



# ఢిల్లీలో మరోసారి బాంబు బెదిరింపులు

## 5 మ్యూజియంలకు హెచ్చరికలు..!

న్యూఢిల్లీ, జూన్ 12 (ప్రభాత ఉదయం): దేశ రాజధాని ఢిల్లీలో మరోసారి బాంబు బెదిరింపులు తీవ్ర కలకలం రేపుతున్నాయి. ఢిల్లీలోని 15 మ్యూజియంలకు తాజాగా బాంబు ఉన్నట్లు హెచ్చరికలు వచ్చినట్టు పోలీసులు బుధవారం చెప్పుకొచ్చారు. ఈ మెయిల్స్ ద్వారా వార్నింగ్స్ వచ్చినట్టు పేర్కొన్నారు. దీనిపై సమాచారం అందిన వెంటనే పోలీసులు రంగంలోకి దిగి ఎంక్వైరీ చేపట్టారు. ఆయా మ్యూజియంలలో బాంబ్ స్క్వాడ్‌తో పోలీసులు తనిఖీలు చేపట్టారు. అయితే, సోదాల్లో భాగంగా ఎలాంటి అనుమానిత వస్తువులు దొరకలేదని బాంబ్ స్క్వాడ్ తెలిపింది. దీంతో బాంబ్ బెదిరింపులు బూటకమని.. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్టు ఢిల్లీ పోలీసులు చెప్పారు. ఇటీవల ఢిల్లీలోని పాఠశాలలు, ఆస్పత్రులతో సహా ఎయిర్ పోర్టుకు సైతం వరుసగా బాంబ్ ÷దిరింపులతో కూడిన ఈ మెయిల్స్ వచ్చిన విషయం తెలిసిందే. కాగా, వరుస బాంబు బెదిరింపుల హెచ్చరికల నేపథ్యంలో ఢిల్లీలో ఆందోళన కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో జన సందోహం ఎక్కువగా ఉండే ఏరియాల్లో పోలీసులు భద్రతను భారీగా పెంచేశారు.

# హైదరాబాద్ మోష్ పబ్ కేసులో 8 మంది అరెస్ట్

**మొదటి పేజీ తరువాయి...**

టిండర్, ఇతర డేటింగ్ యాప్‌లతో వ్యాపారులకు, విద్యార్థులకు వలపు వల వేస్తూ తప్పించుకు తిరుగుతున్న పలువురిని పోలీసులు అరెస్ట్ చేశారు. డబ్బున్న వాళ్లను పబ్కి వచ్చేలా చేసి ఖరీదైన మందు తాపించి లక్షల రూపాయలు కొల్లగొడుతున్నారు. రాజధానిలో ఈ అక్రమ దందా గత కొంతకాలంగా గుట్టుచప్పుడు కాకుండా జరుగుతుంది. ఇటీవల ఓ వ్యక్తి టిండర్ యాప్ లో రితిక అనే మహిళను డేటింగ్ యాప్లో కలిసి మోసపోవడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో హైదరాబాద్ పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో మోష్ పబ్ ప్రతినిధులతో పాటు మరో ఎనిమిది మందిని అరెస్ట్ చేశారు.



# రాష్ట్రవ్యాప్తంగా విస్తరించిన నైరుతి

**మొదటి పేజీ తరువాయి...**

పేర్కొన్నది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో కూడిన ఈదురుగాలులతోపాటు వర్షాలు కురుస్తాయని పేరొన్నది. వర్షాల నేపథ్యంలో రాష్ట్రంలో గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా దిగువకు చేరాయి. మంగళవారం నల్లగొండ, సూర్యాపేట, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో అకడకడా వర్షాలు పడినట్టు వాతావరణ శాఖ తెలిపింది.



## సరైన ఆధారాల కోసమే
# అఫిడవిట్ దాఖిలు

### కాళేశ్వరంపై విచారణ పక్రియ కొనసాగుతోంది
### నిర్మాణం, డిజైన్, మెంటేనెన్స్ గురించి పూర్తి వివరాలివ్వండి
### ఏజెన్సీలను అదేశించిన జస్టిస్ చంద్ర ఘోష్

హైదరాబాద్, జూన్ 12 (ప్రభాత ఉదయం): కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల నిర్మాణంపై విచారణ పక్రియ కొనసాగుతోంది. ప్రాజెక్ట్‌లో జరిగిన అవకతవకలపై జస్టిస్ చంద్ర ఘోష్ కమిటీ విచారణ కొనసాగుతున్న సంగతి తెలిసిందే. అయితే ఇప్పటికే ప్రాజెక్టును సందర్శించిన కమిటీ.. ఇప్పుడు విచారణను వేగవంతం చేసింది. ఈనేపథ్యంలో కాళేశ్వరం కమిషన్ చీఫ్ జస్టిస్ చంద్ర ఘోష్ మాట్లాడుతూ.. ఈరోజు ఏజెన్సీలతో సమావేశం అయ్యాము. వాళ్లను అఫిడవిట్ ఫైల్ చేయమని చెప్పానని, గ్రౌండ్ రిపోర్ట్ తెలుసుకోవాలని అఫిడవిట్ ఫైల్ చేయమన్నాని ఆయన తెలిపారు. టైం బౌండ్ గురించి ఏజెన్సీలు అందరూ చెప్తున్నారు. ప్రభుత్వం విధించిన సమయంలో ప్రాజెక్టు అందించామని అన్నారని, ఎజెన్సీలను నిర్మాణం, డిజైన్, మెంటేనెన్స్ గురించి పూర్తిగా ఇవ్వాలని అదేశించానన్నారు జస్టిస్ చంద్ర ఘోష్.ఏది చెప్పినా, ఎవరూ కమిషన్ కు చెప్పినా ప్రతిదీ రికార్డు రూపంలో ఉండాలని, ఈ నెలాఖరు లోపు అఫిడవిట్‌రూపంలో సమాధానం ఇవ్వాలని అదేశించామని ఆయన తెలిపారు. ఎవరి ఆదేశాల మేరకు నులు జరిగాయి అనేది రికార్డు రూపంలో సమాధానం వచ్చాక వాళ్లను కూడా పిలుస్తామని, సరైన ఆధారాల కోసమే అఫిడవిట్ దాఖలు చేయమని చెప్తున్నానని ఆయన పేర్కొన్నారు. ఇప్పటి వరకు వచ్చిన వాళ్ళతో అఫిడవిట్ వచ్చాక ఇతర వ్యక్తులను కూడా పిలుస్తానని, కొంతమంది అధికారులు స్టేట్‌లో లేరు.వాళ్లను కూడా విచారణ చేస్తామన్నారు చంద్ర ఘోష్. విజిలెన్స్, కాగ్ రిపోర్టులు అందాయి.వాళ్లను కూడా విచారణ చేస్తామని, తప్పుడు అఫిడవిట్ ఫిల్ చేస్తే మాకు తెలిసిపోతుందన్నారు.

# వానాకాలం పంటలలో యాజమాన్య పద్ధతులపై జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తల సూచనలు



వ్యవసాయ విశ్వవిద్యాలయం ముఖ ద్వారం



డాక్టర్ పి. రఘురామిరెడ్డి



వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనం

రాజేంద్రనగర్, జూన్12(ప్రభాత ఉదయం): ఈ సంవత్సరం వానాకాలంలో నైరుతి రుతుపవనాలు తెలంగాణ రాష్ట్రంలో జూన్ 3వ తేదీన ప్రవేశించి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు జూన్ 12వ తేదీ కల్లా విస్తరించాయి. న్యూ ఢిల్లీలోని భారత వాతావరణ విభాగం వారి దీర్ఘకాలిక ముందస్తు వాతావరణ సూచనల ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో ఈ వానాకాలం సీజన్ లో వర్షాలు సాధారణం కన్నా ఎక్కువగా కురిసే అవకాశం ఉంది. రైతులు నేల రకం, నీటి వసతి, పెట్టుబడి లభ్యత మొదలగు అంశాలను పరిగణనలోనికి తీసుకొని పంటలు, పంట రకాలను ఎంపిక చేసుకోవలెనని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డాక్టర్ పి. రఘురామి రెడ్డి సూచించారు.తెలంగాణ రాష్ట్రంలో ప్రధానంగా వరి, ప్రత్తి, కంది, మొక్కజొన్న, సోయా చిక్కుడు ప్రధాన పంటలుగా అధిక విస్తీర్ణంలో సాగు చేయబడుతున్నాయి. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం మార్కెటింగ్ ఇంటెలిజెన్స్ వారి ముందస్తు ధరల సూచనల ప్రకారం ఈ సంవత్సరం పండించే ప్రధాన పంటలకు కనీస మద్దతు ధరల కన్నా ఎక్కువగా ధరలు పలికే అవకాశం ఉందని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వరి పంట సుమారుగా 65 లక్షల ఎకరాలలో వానాకాలంలో సాగు చేయడం జరుగుతుంది. వరి పంటను సాగు చేసే రైతులు పచ్చి రొట్ట పంటలైన జనము, జీలుగ పంటలను సాగు చేసి నేల సారవంతత పెంపొందించుకోవడమే కాక చీడ పీడలను తట్టుకునే శక్తి మొక్కకు వస్తుంది మరియు పశువుల పేడ లభ్యత తక్కువగా ఉన్నందున ప్రత్యామ్నాయంగా పచ్చి రొట్ట పంటలను సాగు చేయవలెను. తక్కువ కాలపరిమితి గల పెసర పంటను పచ్చిరొట్ట పంట గాను లేదా విత్తన పంట గాను సాగు చేసినట్లయితే విత్తనము తో పాటుగా నేల సారవంతం పెంపొందించుకోవచ్చు. ఎంపిక చేసుకొనిన దీర్ఘకాలిక వరి రకాలను జూన్ 20 తేదీ వరకు, మధ్యకాలిక రకాలను జూలై 10వ తేదీ వరకు మరియు స్వల్పకాలిక రకాలను జూలై మొదటి వారం నుండి చివరి వరకు నారు పోసుకొని ప్రధాన పొలంలో నాటుకోవలెను. తెలంగాణ సోనా ( ఆర్ ఎన్ ఆర్ 15048) ఫోటో సెన్సిటివ్ రకం. కావున జూన్ మాసంలో నారుపోసుకున్నట్లు అయితే ఎక్కువ ఎత్తు పెరిగి ఆలస్యంగా పూతకు వచ్చి పంట నేలపై పడిపోవును. కావున తెలంగాణ సోనా రకము జూలై మొదటి వారం నుండి మాత్రమే నారు పోసుకోవలెను. వరి పంటను నేరుగా విత్తే పద్ధతిలో దమ్ము చేసిన పొలంలో విత్తనాలను వేసుకోవడం లేదా దుక్కి దున్నిన తర్వాత పొలంలో నేరుగా పొడి విత్తనాలను వేసుకోవడం పద్ధతిలో సరియైన సమయంలో పంటను విత్తుకోవచ్చు, కూలీల సమస్య కూడా తగ్గించుకోవచ్చు పని సూచించారు. రాష్ట్రంలో ప్రత్తి పంట సుమారుగా 45 లక్షల ఎకరాలలో సాగు చేయడం జరుగుతుంది. రైతులు విత్తే నియమం పాటించడం ద్వారా అనగా తేలిక నేలల్లో 50 నుండి 60 మిల్లీమీటర్ల వర్షపాతం, బరువైన నేలలు 60 నుండి 75 మిల్లీమీటర్ వర్షపాతం నమోదైన తర్వాత మాత్రమే విత్తనం వేసుకోవడం వలన అధిక మొలక శాతం పొందడమే కాకుండా బెట్ట పరిస్థితులను మొక్కలు తట్టుకోగలవు. అధిక సాంద్రతలో ప్రత్తి సాగు( హెచ్ డీపీఎస్) చేయడం ద్వారా ఎకరాకు రెండున్నర నుంచి మూడు క్వింటాళ్లు అధిక దిగుబడి పొందవచ్చును. కంది పంట రాష్ట్రంలో సుమారుగా 4 లక్షల 70 వేల ఎకరాల విస్తీర్ణంలో సాగు చేయడం జరుగుతుంది. కంది పంట మొదటి 60 రోజులలో పెరుగుదల తక్కువగా ఉండడం వల్ల అంతర పంటలుగా పెసర, మొక్కజొన్న, ప్రత్తి మొదలగు పంటలను సాగు చేసి ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఎదురైనను పంట నష్టం జరగకుండా దిగుబడులను సాధించవచ్చు. అభివృద్ధి పరచబడిన నూతన కంది రకాలు 160 నుండి 180 రోజుల పంట కాలముతో గొడ్డు మోతు తెగులు మరియు ఎండు తెగులును తట్టుకొని అధిక దిగుబడులను ఇచ్చును.వ్యవసాయ విశ్వవిద్యాలయం అభివృద్ధి పరిచిన అధిక దిగుబడి నిచ్చే మొక్కజొన్న సంకర రకాలు (డి హెచ్ ఎం 117, డి హెచ్ ఎం 121) ప్రైవేట్ హైబ్రిడ్లతో పోటీగా దీటైన దిగుబడులు ఇవ్వడమే కాకుండా విత్తన ఖరీదు కూడా తక్కువగా ఉంటుంది. మొక్కజొన్న పంట అధిక వర్షాలను, బెట్టను తట్టుకోలేదు కావున మొక్కజొన్న పంటను బోదె సాళ్ల పద్ధతిలో సాగు చేయవలెను. కందితో అంతర పంటగా మొక్క జొన్న సాగు చేసుకోవాలి. సోయా చిక్కుడు పంటను ప్రధానంగా అదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి మరియు సంగారెడ్డి జిల్లాలలో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. సోయా చిక్కుడు పంటను జూన్ 30వ తేదీ లోపు విత్తనం వేసుకోవాలి. జూలై మాసంలో విత్తినట్లు అయినా దిగుబడులు తగ్గిపోవును. ఎత్తు మడుగుల పద్ధతి లో సోయా చిక్కుడును సాగు చేయడం వలన అధిక వర్షాలు కురిసినప్పుడు నీరు బయటకు వెళ్లి పోవును మరియు వర్షాభావ పరిస్థితులలో నేలలో తేమ సంరక్షించబడి పంటకు అందజేయడం జరుగుతుంది. సోయా చిక్కుడులో ఎకరాకు 25 నుండి 30 కిలోల విత్తనం వినియోగించ వలెను. అధిక మోతాదులో విత్తనం వేసినట్లయితే మొక్కల సాంద్రత పెరగడం వలన తెగులు ఎక్కువగా ఆశించే అవకాశం కలదు. స్టెమ్ ఫ్లై ఉధృతిని గమనిస్తూ నివారణ చర్యలను చేపట్టవలెను. సోయా చిక్కుడు పంట తర్వాత మొక్కజొన్న లేదా శనగ పంటను పంట క్రమముగా వేసుకోవాలి. ప్రస్తుత మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వర్షాకాలంలో తక్కువ సమయంలో అధిక మోతాదులో వర్షాలు కురవడం, వర్షాభావ పరిస్థితులు ఎక్కువ సమయం ఉండడం వలన మొక్కలకు, వర్షాధారంగా సాగు చేసే పంటలకు తేమ లభ్యత తగ్గిపోతుంది. కావున సాధ్యమైనంతవరకు వర్షపు నీటిని పంట పొలంలోనే ఇంకిపోయే విధంగా యాజమాన్య పద్ధతులను పాటించవలెనని రఘురామి రెడ్డి సూచించారు. వర్షాధార పంటలలో పంటలను బోదె సాళ్ల పద్ధతిలో లేదా ఎత్తు మడిలో పద్ధతిలో వితుక్కోవడం, అంతర కృషి చేయడం, అంతర పంటలను సాగు చేయడం, నేరుగా వెదజల్లే పద్ధతిని పాటించి వరి సాగు చేయడం, రసాయన ఎరువులను మాత్రమే వాడకుండా పచ్చి రొట్ట ఎరువులను సాగు చేసి నేలలో కలియ దున్నడం, సేంద్రియ మరియు బయో ఫెర్టిలజెర్స్ ను వినియోగించడం, సమగ్ర ఎరువుల యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా మారుతున్న వాతావరణ పరిస్థితులను తట్టుకొని పంట నష్టమును నివారించి అధిక దిగుబడులను పొందవచ్చునని ఆయన అన్నారు.



## అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం పోరాడిన మహనీయుడు పండుగ సాయన్న

### గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

గద్వాల జిల్లా ప్రతినిధి,జూన్12(ప్రభాత ఉదయం)అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం పోరాడిన మహనీయుడు పండుగ సాయన్న అని, ఆయన చూపిన మార్గంలో అందరు ముందుకు సాగాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. గద్వాల మండలం జిల్లెడ బండ గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలోనూతనంగా ఏర్పాటు చేసిన పండుగ సాయన్న విగ్రహాన్ని బుధవారం గద్వాల ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... భూస్వాములు, రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటం చేసి పేదలను ఆదుకున్న దేవుడు పండుగ సాయన్న అని అన్నారు. పండుగ సాయన్న ఒక ముదిరాజ్ కులానికే పరిమితం కాదని, ఆనాటి బహుజనులలో ఉన్న పేదలందరి కోసం పోరాటం చేసిన మహనీయుడని కొనియాడారు. పేదలు ఆకలితో అలమటించరాదన్న ఉద్దేశంతో జమీందారులను దోచి బహుజనుల పేదవారికి పంపిణీ చేశారని, భయంతో బతుకులీడ్చే బడుగు వర్గాల వారందరికి అన్నం పెట్టిన మహనుభావుడని, ఆయన కాలు మోపిన చోట పండుగే జరిగేదని ఆయన అన్నారు. గ్రామంలో ప్రతి ఒక్కరు కలిసి మెలిసి విగ్రహ ప్రతిష్టకు కృషి చేశారని, అదేవిధంగా భవిష్యత్తులో కూడా గ్రామ అభివృద్ధికి కూడా ప్రతి ఒక్కరు కూడా కలిసిమెలిసి గ్రామ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సుభాన్, ఎంపీపీ రాజారెడ్డి, జెడ్పీటీసీ ప్రభాకర్ రెడ్డి, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీధర్ గౌడ్, మాజీ సర్పంచ్ సత్యమ్మ, నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, పటేల్ ప్రభాకర్ రెడ్డి, రమేష్ నాయుడు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## విత్తనాలు ఎక్కువ ధరకు అమ్మితే కఠిన చర్యలు

### గద్వాల ఇంచార్జి ఎంఏఓ శ్రీలత

గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 12(ప్రభాత ఉదయం)రైతులకు అధిక ధరలకు విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని గద్వాల ఇంచార్జి ఎంఏఓ శ్రీలత హెచ్చరించారు. బుధవారం గద్వాల పట్టణంలోని పలు ఫర్టిలైజర్, ఫెస్టిసైడ్స్ దుకాణాలను వ్యవసాయ అధికారులతోపాటు టాస్క్ ఫోర్స్ బృందం తనిఖీ చేసింది. ఈ సందర్భంగా షాపుల్లో విత్తనాలు, పురుగు మందులను పరిశీలించారు. రైతులకు ఇచ్చే బిల్లులను, స్టాక్ బోర్డులను, స్టాక్ రిజిష్టర్ లను తనిఖీ చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను ఎమ్మార్పీకే విక్రయించాలని అన్నారు. రైతులు ఎరువులు, విత్తనాలు కొన్న వెంటనే రైతులు ఫర్టిలైజర్ షాపుల నుంచి బిల్లులు తీసుకోవాలన్నారు. విత్తనాలు మొలకెత్తకపోతే ఆ బిల్లుల ద్వారా నష్టపరిహారం పొందే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ ఏఓ జనార్దన్, ఏఎస్ఐ వెంకటేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, చిత్రంలో సీనియర్ నాయకులు మాధవరెడ్డి

## ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌ను కలిసిన ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి

రాజేంద్రనగర్, జూన్12(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ ను ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికల్లో టిఆర్ఎస్ ఎమ్మెల్సీగా విజయం సాధించిన నవీన్ కుమార్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం మైలార్దేవ్పల్లిలోని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ స్వగృహానికి స్థానిక నాయకులు ఎద్దుల మాధవరెడ్డి తో కలిసి తాను ఎమ్మెల్సీగా ఎన్నికై ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా మన స్వీకారానికి హాజరుకావాలని పుష్పగుచ్ఛం అందజేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని ప్రజలు మరోసారి కోరుకుంటున్నారన్నారు.



## సిపి గెట్- 2024 ద్వారా పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

### పీజీ సెంటర్ గద్వాల ప్రిన్సిపాల్ డాక్టర్ చవ్వా వెంకట్ రెడ్డి

గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 12(ప్రభాత ఉదయం) పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు సిపి గెట్ -2024 నోటిఫికేషన్ విడుదలైందనీ, ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఈ నెల 17 వ తేదీ వరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని పీజీ సెంటర్ గద్వాల ప్రిన్సిపాల్ డాక్టర్ చవ్వా వెంకట్ రెడ్డి బుధవారం తెలియజేశారు. డిగ్రీ పూర్తయిన విద్యార్థులతో పాటు డిగ్రీ తృతీయ సంవత్సరం పరీక్షలు రాసిన విద్యార్థులు కూడా ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన వెల్లడించారు. గద్వాల పీజీ సెంటర్లో ఎం.ఏ తెలుగు, ఎం.ఏ ఇంగ్లీష్, ఎం.కామ్ కామర్స్, ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్, ఎంబీఏ కోర్సులు అందుబాటులో ఉన్నాయని ఎంబీఏ కోర్స్ లో ప్రవేశానికై ఐసెట్ 2024 అర్హత సాధించి ఉండాలని ప్రిన్స్ పాల్ తెలిపారు.




స్కూల్ బస్సుల తనిఖీలు

### నగర శివారు రాజేంద్రనగర్‌లో

## స్కూల్ బస్సులపై కొరడా

బుద్వేల్, జూన్12(ప్రభాత ఉదయం): బుధవారం నుండి పాఠశాలలు ప్రారంభం కావడంతో విద్యార్థులను రవాణా చేసే స్కూల్ బస్సు లపై ఆర్టీఏ అధికారులు ఫోకస్ పెట్టారు. ఫిట్నెస్, ఇన్సూరెన్స్, పర్మిట్, డ్రైవర్ డ్రైవింగ్ లైసెన్స్, ఫయర్ సేఫ్టి కిట్, ఫస్ట్ ఎయిడ్ కిట్ లను క్షణంగా తనిఖీలు చేశారు. నిబంధనలు. పాటించకుండ నడుపుతున్న పలు బస్సులను రంగారెడ్డి జిల్లా రవాణా శాఖ అధికారులు సీజ్ చేశారు. రాజేంద్రనగర్, శంషాబాద్, మొయినాబాద్, శేరిలింగంపల్లి తో పాటు పలు చోట్ల అధికారులు విస్తృత సోదాలు నిర్వహించారు.



బస్సు లోపలి భాగాన్ని పరిశీలిస్తున్న ఆర్టీఏ అధికారిణి

# రాజేంద్రనగర్ మండలంలో బడిబాట



శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో జరిగిన బడి బాట కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్, కార్పొరేటర్ పి. అర్చన జయప్రకాష్ లు



రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ ఎం. సుగుణ, తదితరులు



సులేమాన్ నగర్ ఉర్దు పాఠశాల లో పుస్తకాలు పంపిణీ చేస్తున్న మజ్లీస్ కార్పొరేటర్ నవాజుద్దీన్ తదితరులు

బుద్వేల్, జూన్12(ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ మండలములో మండల విద్యాధికారి రాం రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా "పాఠశాల సంసిద్ధత కార్యక్రమం" మండల స్థాయిలో శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ శాసనసభ్యులు ప్రకాష్ గౌడ్ హాజరైనారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందచేస్తున్న పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేశారు. . అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యావసతుల కల్పన కోసం ప్రభుత్వం చేపడుతున్న పనులవల్ల ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా రూపుదిద్దుకున్నాయని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో బడిఈడు పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను, ప్రజలను కోరారు. నేడు నిర్వహించిన కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ పి. అర్చన, స్థానిక పాఠశాల కమిటీ చైర్మన్ సునీత , పాఠశాల మాజీ చైర్మన్ శ్రీధర్ రెడ్డి స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిషన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు , స్థానికులు పాల్గొన్నారు.



డాక్టర్ ఎం సుగుణ



సులేమాన్ నగర్ ఉర్దు మీడియం పాఠశాలలో మొదటి రోజు విద్యార్థులు

# పారేపల్లి శ్రీనివాస్ గౌడ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

శంషాబాద్, జూన్ 12( ప్రభాత ఉదయం) శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని తొండుపల్లి 11వ వార్డ్ కౌన్సిలర్ లావణ్య భర్త శ్రీనివాస్ గౌడ్ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టిఆర్ఎస్ బిజెపి నాయకులు ఆయన చేత కేక్ కట్ చేయించి శాలువాతో సన్మానించారు. ఈ వేడుకల్లో కౌన్సిలర్ ,కొండ ప్రవీణ్ గౌడ్, మాజీ ఉప సర్పంచ్ పెదిరిపాటి ప్రవీణ్ గౌడ్. బిజెపి నాయకుడు కొండ పరమేష్ గౌడ్, టిఆర్ఎస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రాచమల్ల సురేష్ కుమార్ . కొమ్మగంటి రాజు గౌడ్, కొండా సుదర్శన్ గౌడ్, దొడ్డే పెంటయ్య, కొమ్మ గంటి అశోక్ గౌడ్, త్రిశూల్ గౌడ్, రంజిత్ గౌడ్, పారేపల్లి రంజిత్ గౌడ్, పారేపల్లి అశోక్ గౌడ్, పెద్దిరి పాటీ సుధాకర్ గౌడ్, కర్ణాకర్ గౌడ్, సుఖానంద్ , ఇంజమూరి అమరేందర్ గౌడ్ , ఇంజామూరి రాజు గౌడ్, కమ్మెట శేఖర్ గౌడ్, ప్రసాద్, యమ్మ శ్రీను, బత్కు మహేష్, నవీన్, ప్రసాద్, దర్శన్, నిరంజన్, రవి తదితరులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.



## ఫోన్ ట్యాపింగ్ నిందితులకు బెయిల్ తిరస్కరణ



హైదరాబాద్, జూన్ 12 (ప్రభాత ఉదయం) ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులుగా ఉన్న అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్నలకు నాంపల్లి కోర్టులో చుక్కెదురైంది. దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లను నాంపల్లి కోర్టు కొట్టివేసింది. రాజకీయ దురుద్దేశంతోనే అరెస్టు చేశారని, కేసులో సాక్ష్యాధారాలను కోర్టుకు సమర్పించలేదని పిటిషనర్ల తరపు న్యాయవాదులు కోర్టు దృష్టికి తెచ్చారు. నిందితులను విచారించాల్సి ఉందని, వారికి బెయిల్ మంజూరు చేయొద్దని ప్రభుత్వ తరుపు న్యాయవాది వాదించారు. ఆయన వాదనలతో ఏకీభవించిన కోర్టు బెయిల్ పిటిషన్లను కొట్టివేసింది. ప్రస్తుతం వీరు చంచల్ గూడ జైల్లో ఉన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై మార్చి 10న ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు.. ఇప్పటి వరకు ప్రణీత్‌రావు, భుజంగరావు, తిరుపతన్న, రాధాకిషన్‌రావును అరెస్టు చేశారు.

## రైతులపై అడవి పంది దాడి



గాయాలపాలైన రైతు

కేటిదొడ్డి,జూన్12(ప్రభాత ఉదయం) రైతులపై అడవి పంది దాడి చేసి గాయపరిచిన ఘటన కేటిదొడ్డి మండలం గంగన్ పల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానిక రైతులు తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన బాషమౌలాలి, ఫాంటన్న రైతులు తమ వ్యవసాయ పొలంలో పని చేస్తుండగా వారి పైన అడవి పంది దాడి చేసింది. ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం గద్వాల ఆసుపత్రికి తరలించారు.

## ప్రభుత్వ బడుల్లో మెరుగైన విద్య: ఎమ్మెల్యే జిఎంఆర్

### బడిబాట కార్యక్రమంలో పుస్తకాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే జిఎంఆర్



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

కొత్తకోట, జూన్12(ప్రభాత ఉదయం) బిఆర్ఎస్ పాలన లో గత 10 సంవత్సరాలుగా విద్య వ్యవస్థ నిర్లక్ష్యానికి గురైందని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి అన్నారు. బుధవారం కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలోని వేసవి సెలవులు అనంతరం పాఠశాలల పునః ప్రారంభం సందర్భంగా స్థానిక ఉర్దూ మీడియం పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా యూనిఫార్మ్, పాఠ్య పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని అధికారులు, స్థానిక నాయకులు కలిసి విద్యార్థిని, విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫార్మ్ పంపిణీ ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిఎంఆర్ మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన, గుణాత్మకమైన విద్య అందుతుందని అన్నారు, సర్కార్ బడుల్లో విద్యార్థుల కోసం మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు, తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన తర్వాత మొట్టమొదటిసారిగా స్కూల్ ప్రారంభం రోజునే యూనిఫాంలు, పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ విద్యార్థులకు అందజేశామని తెలిపారు. ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ కోడ్ కి ముందే ప్రభుత్వం తెలంగాణలో 26 వేల స్కూల్ లకి 11 వందల కోట్ల తో అమ్మ ఆదర్శ పాఠశాల పేరుతో మౌలిక వసతులు విద్యుత్ ,డ్రింకింగ్ వాటర్ ,టేబుల్స్ ఇలా వసతులు అన్ని కల్పించామన్నారు, గత 10 సంవత్సరాలుగా విద్య నిర్లక్ష్యానికి గురైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యత విద్య ఇస్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ప్రముఖ ఐఏఎస్, ఐపీఎస్ లు ప్రభుత్వ పాఠశాలల నుండి వచ్చిన వాళ్ళమన్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రతి పాఠశాలలో అనుభవమైన ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. పాఠశాలలో అనేక వసతులు కల్పిస్తున్నామన్నారు. విద్యకి అనేక రకాల సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలు, కంప్యూటర్ ఇలా అన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి పాఠశాలలో ఏం అవసరం ఉన్న తీరుస్తున్నామన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు సమాజం గురించి, విద్య గురించి ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## పిల్లలను విద్యావంతులను చేసినప్పుడే మంచి భవిష్యత్తు: ఎంపీపీ మనోరమ్మ

### బడిబాట కార్యక్రమంలో తల్లిదండ్రులకు సూచించిన ఎంపీపీ

కేటిదొడ్డి, జూన్12(ప్రభాత ఉదయం) తల్లిదండ్రులు పిల్లలను విద్యావంతులను చేసినప్పుడే మంచి భవిష్యత్తు ఉంటుందని ఎంపీపీ మనోరమ సూచించారు. బుధవారం మండలంలోని గంగన్ పల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాల పంపిణీ , ఉచిత ఏకరూప దుస్తుల పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ మనోరమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమామహేశ్వర్ పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఎంపీపీ మనోరమ మాట్లాడుతూ... విద్యార్థులందరు కూడా చక్కగా చదువుకొని భవిష్యత్ లో ఉన్నతమైన స్థానంలో ఉండాలని,బడి బయట పిల్లలు ఎవ్వరు కూడా ఉండకూడదని సూచించారు.



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న జడ్ పి టి సి విశాల శ్రవణ్ రెడ్డి

## ప్రభుత్వ పాఠశాలలు గ్రామాలకు పట్టుకొమ్మలు

### కేశంపేట జడ్ పి టి సి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి

షాద్ నగర్,జూన్ 12 (ప్రభాత ఉదయం):విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి ఉన్నత శిఖరాలకు చేరే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని కేశంపేట మండలం జడ్పిటిసి తాండ్ర విశాలా శ్రావణ్ రెడ్డి తెలిపారు.బుధవారం కేశంపేట్ మండల కేంద్రంలోని ప్రాథమి పాఠశాల,పాపిరెడ్డి గూడ గ్రామ ప్రాథమిక పాఠశాలలో పాఠశాల విద్యార్థులకు యూనిఫార్మ్,పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు కేశంపేట మండలం ఎంఈఓ మనోహర్ ఆధ్వర్యంలో నిర్వహించిన దానికి కేశంపేట మండల జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కేశంపేట జడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని ఇందులో భాగంగా నాణ్యమైన విద్యను మంచి సౌకర్యాలతో ప్రభుత్వ పాఠశాలలను అన్ని విధాల మెరుగుపరుస్తూ ముందుకు వెళ్తున్నారని తెలియజేశారు.ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు,విద్యార్థులు సమన్వయంతో ముందుకు సాగుతూ ప్రభుత్వ పాఠశాలకు పూర్వవైభవం తీసుకురావాలని కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మార్వో,ఇన్చార్జ్ ఎంపిడిఓ,మండల ఎంన్వో,ఏపీఎం,ప్రాథమిక పాఠశాల ఉన్నత పాఠశాల హెచ్ఎమ్స్,ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యతోనే సమాజాభివృద్ధి

### సి డి సి మాజీ చైర్మన్ మూలమల్ల చంద్రశేఖర్ రెడ్డి



రామకృష్ణాపురం పాఠశాల ఆవరణలో మొక్క నాటుతున్న మాజీ సి డి సి చైర్మన్ మూలమల్ల చంద్రశేఖర్ రెడ్డి ..



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న చంద్రశేఖర్ రెడ్డి

కొత్తకోట, జూన్ 12(ప్రభాత ఉదయం) విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని అందుకోసం పిల్లల తల్లిదండ్రులు విధిగా విద్యావంతులను చేయాల్సిన బాధ్యత వారిపై ఉందని కొత్తకోట మండలం రామకృష్ణాపురం గ్రామం మాజీ పిఎసిఎస్ చైర్మన్, సి డి సి మాజీ చైర్మన్ మూలమల్ల చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైన సందర్భంగా కొత్తకోట మండలం రామకృష్ణాపురం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు మురళి కృష్ణ ఆధ్వర్యంలో నూతనంగా చేరిన విద్యార్థులను వారి తల్లిదండ్రులను ప్రతి విద్యార్థికి ఒక మొక్కను బహుమతిగా ఇచ్చి సాధారణంగా ఆహ్వానిస్తూ వారిచే పాఠశాల ఆవరణంలో మొక్కను ఆయన నాటారు.ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ... గత ప్రభుత్వం విద్యా వ్యవస్థను అస్తవ్యస్తం చేసిందని సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో విద్యకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ విద్యా సంవత్సరం ఆరంభంలోనే అన్ని వసతులు, పిల్లలకు పుస్తకాలు అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ జరీనా , గ్రామ పెద్దలు మాసన్న , ఉపాధ్యాయులు సలీం, రేవతమ్మ కల్పన ,రజిత తో పాటు అంగన్వాడి టీచర్ నిర్మలమ్మ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. అనంతరం తల్లిదండ్రులకు విద్యార్థి ప్రవేశపత్రాన్ని అందించారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.